జిందగీ
# చింతన
నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 5 ఆగస్టు 2024
www.ntnews.com




సందర్భం

# వ్రతాల మాసం శ్రావణం

**శ్రావణ మాసం... ఈ పేరు పలికితేనే మహిళల మనసు పులకరిస్తుంది. ప్రతి ఇంట్లోనూ ఆధ్యాత్మిక శోభ ప్రతిఫలిస్తుంది. వానలు సమృద్ధిగా కురిసి ప్రకృతిలో కొత్త కాంతి తొంగిచూస్తుంది. ఎటుచూసినా ఆహ్లాదకర వాతావరణం కనిపిస్తుంది. మరోపక్క నూతన వస్త్రాలు, ఆభరణాలు తదితర సుమంగళ ద్రవ్యాల కొనుగోళ్లతో ఇంటింటా సందడి ప్రారంభమవుతుంది. ప్రతి మనసూ ఆనందంతో పరవశిస్తూ ఉంటుంది. మొత్తంగా, ఆధ్యాత్మిక, ఆనందాల సమ్మేళనంతో శ్రావణమాసం సమాజంలో సరికొత్త శోభ తీసుకువస్తుంది.**

శ్రావణం వచ్చిందంటే చాలు... ప్రతి ఇంట్లోనూ వ్రతాలు శ్రీకారం చుట్టుకుంటాయి. ఈ నెల అడుగు పెట్టడానికి ముందే కొత్త పెండ్లికూతుళ్లు నోములు పట్టేందుకు ప్రణాళికలు చేస్తుంటారు. మంగళగౌరిని పూజించి, వరలక్ష్మీదేవిని అర్చించి.. తమ సౌభాగ్యాన్ని కలకాలం నిలుపుకోవాలని ముత్తయిదువులు ఘనంగా నోములు చేస్తారు. ఇలా శ్రావణంలో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తుంది. ఇంతటి ఆనందాన్ని ప్రజలు అందుకునేందుకు కారణమైన శ్రావణమాసం ఎన్నో ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు అనుకూలంగా ఉంటుంది. సాధారణ ప్రజానీకం కూడా శ్రావణం వచ్చిందంటే శుభముహూర్తాలు వచ్చినట్లే అని భావిస్తారు.

**'నభోమాసం'** అని శ్రావణానికి పేరు. చంద్రుడు పౌర్ణమి నాడు శ్రవణ నక్షత్రంలో సంచరించటం వల్ల ఈ మాసానికి శ్రావణం అని పేరు వచ్చింది. ఈ నెలలో సూర్యుడు కర్కాటక రాశిని విడిచి, సింహ రాశిలోకి ప్రవేశిస్తాడు. సింహ సంక్రమణం జరిగిన తర్వాత పదహారు ఘడియలు పరమ పుణ్యకాలమని ప్రాచీన గ్రంథాలు చెబుతున్నాయి. సూర్యుడు కర్కాటక, సింహ రాశుల్లో ఉన్న సమయంలో మహానదుల్లో తప్ప ఇతర నదుల్లో స్నానం చేయకూడదని శాస్త్రాలు చెబుతున్నాయి. ఈ కాలంలో నదులకు రజస్వల దోషం ఉంటుందని శాస్త్ర వచనం.

### ప్రతిరోజూ పర్వమే..

**శ్రవణం** శ్రీమహావిష్ణువు జన్మ నక్షత్రం. శ్రీమహావిష్ణువు అర్ధాంగి అయిన శ్రీమహాలక్ష్మిని ప్రత్యేకంగా అర్చించడం కూడా ఈ మాసంలో కనిపిస్తుంది. పరిశీలన చేస్తే లక్ష్మీదేవి, మహావిష్ణువు అనుగ్రహం పొందడానికి వీలైన మాసం ఇది. వేదాలను కాపాడటానికి శ్రీమహావిష్ణువు హయగ్రీవునిగా అవతారం ధరించింది ఈ నెలలోనే. అందువల్ల ఈ నెలలో వేద గ్రంథ ముద్రణకు సహకరించడం పుణ్యప్రదం. కనీసం వేద విద్యార్థులకు వేద గ్రంథాలు దానం చేసినా శ్రీమహావిష్ణువును సేవించిన ఫలితం కలుగుతుందని పెద్దల మాట.

**పరమేశ్వరునికి** కూడా శ్రావణం ఎంతో ప్రీతికరమైనది. శ్రావణ సోమవారాల్లో మహాశివుడికి అభిషేకాలు, అర్చనలు చేయాలి. ఉత్తరాదిన శ్రావణ సోమవారాల్లో శివారాధన అత్యంత వైభవంగా చేస్తారు. కాశి, ఉజ్జయిని, సోమనాథ్ వంటి శైవక్షేత్రాలు.. శ్రావణ సోమవారాల్లో భక్తులతో కిటకిటలాడుతాయి. ఈ రకంగా శివ కేశవ అభేదాన్ని ఈ మాసం చాటుతుంది.

**శ్రావణంలో** ఒక్కో రోజు ఒక్కో దేవతను పూజించాలని శాస్త్రం సూచించింది. ఈ ప్రకారం శ్రావణ సోమవారాల్లో పరమేశ్వరుడు; మంగళవారాల్లో గౌరీ వ్రతం లేదా అర్చనలు; బుధవారం విఠలేశ్వరుడు; గురువారాల్లో గురుదేవుడు; శుక్రవారాల్లో లక్ష్మీదేవి లేదా తులసి పూజలు; శనివారాల్లో శనీశ్వరుడు, వేంకటేశ్వరుడు, ఆంజనేయస్వామికి విశేషంగా అర్చనలు చేయాలని పేర్కొన్నారు.

**శ్రావణం** చంద్రుడి మాసం. జ్యోతిష శాస్త్ర రీత్యా చంద్రుడు మనసుకు కారకుడు. అంటే మనసు మీద ప్రభావాన్ని చూపించే గ్రహదేవత అన్నమాట. ఈ మాసంలో రవి సంచరించే నక్షత్రాల ప్రభావం చంద్రుడి కారణంగా మనుషుల మీద ప్రసరిస్తుంది. తత్ ఫలితంగా కలిగే దుష్ప్రభావాలను నివారించుకోవడానికి చంద్ర సంబంధమైన జప, తర్పణ, దాన, హోమాది కార్యక్రమాలు నిర్వహించాలి.

**శ్రీకృష్ణపరమాత్మ** అవతరించింది శ్రావణంలోనే. గరుత్మంతుడు అమృతభాండాన్ని సాధించింది కూడా ఈ నెలలోనే. అళవందారు, బదరీనారాయణ పెరుమాళ్, చూడికుడుత్త నాంచార్ తదితర వైష్ణవ ముఖ్యుల తిరు నక్షత్రాలు ఈ మాసంలోనే వస్తాయి. ఆధునిక యుగంలో ప్రసిద్ధి పొందిన తత్త్వవేత్త అరవిందయోగి శ్రావణంలోనే జన్మించారు. ఈ విధంగా ఎన్నో ప్రత్యేకతలతో అలరారే శ్రావణ మాస వైశిష్ట్యం ఇంత అని చెప్పటానికి సాధ్యం కాదు.

### వ్రతాలు.. అర్చనలు..

**శ్రీ సత్యనారాయణస్వామి వ్రతం:** ఈ మాసంలో వచ్చే శ్రవణ నక్షత్రం రోజున శ్రీరమాసహిత సత్యనారాయణస్వామి వారి వ్రతం చేయాలని చెబుతారు. స్వామివారి జన్మ నక్షత్రమైన శ్రవణం ఉన్ననాడు ఈ వ్రతం ఆచరిస్తే అత్యంత శుభఫలితాలు కలుగుతాయని విశ్వాసం.

**మంగళగౌరీ వ్రతం:** శ్రావణంలో ప్రతి మంగళవారం ముత్తయిదువులందరూ విధి నియమాలు, ఆచారాల ప్రకారం మంగళగౌరీ దేవిని భక్తిశ్రద్ధలతో అర్చించి, వ్రతం చేస్తారు. ప్రత్యేకించి, నూతన వధువులు ఈ వ్రతాన్ని తప్పకుండా ఆచరిస్తారు. దీనిని శ్రీకృష్ణుడు ద్రౌపదికి చెప్పాడని పురాణ కథనం. శ్రావణంలో నెల రోజులు పగటిపూట నిద్రించకూడదు. ఒక పూట మాత్రమే భోజనం చేసి, మంగళగౌరీ దేవిని అర్చిస్తే సకల శుభాలు, మాంగళ్య సౌభాగ్యం కలుగుతాయి.

**శ్రీ వరలక్ష్మీ వ్రతం:** శ్రావణమాసం అనగానే గుర్తుకువచ్చే వ్రతం ఇది. పౌర్ణమికి ముందుగా వచ్చే శుక్రవారం రోజున ఈ వ్రతాన్ని ఆచరిస్తారు. ఏ కార్యానికైనా 'సిద్ధి' ప్రధానం. అది లేకపోతే కార్యానికి ప్రయత్నమే ఉండదు. అందుకే 'సిద్ధి' అనేది మొదటి లక్ష్మి. ఈ దేవత అనుగ్రహం కలిగితే కార్యభారం నుంచి విముక్తులవుతాం. ఆ ముక్తి.. 'మోక్షలక్ష్మి'. ప్రతికూల పరిస్థితులను దాటడమే 'జయలక్ష్మి'. కార్యసాధనకు కావలసిన తెలివితేటలు, సమయస్ఫూర్తి, నిర్ణయశక్తి, విజ్ఞానం మొదలైనవి 'విద్యాలక్ష్మి'. అంటే 'సరస్వతి'. ఈ సరస్వతి ఫలితంగా పొందే సంపద, ఆనందం 'శ్రీలక్ష్మి'. దానివల్ల కలిగే శ్రేష్ఠత్వం, ఉన్నతి 'వరలక్ష్మి'. 'వర' అంటే శ్రేష్ఠమైన అనే అర్థం ఉంది. ఈ శ్రేష్ఠత లక్ష్మి స్వరూపం. శ్రేష్ఠమైన/ ఉన్నతమైన లక్ష్మి (సంపద)ని పొందడమే అందరికీ చివరి గమ్యం.

**శుద్ధసత్త్వ** రూపంతో ప్రకాశించే ఆ జగజ్జననే 'శ్రీలక్ష్మి'. ఈమెను కొందరు అష్టలక్ష్మీ స్వరూపంగా, మరికొందరు 'షోడశ లక్ష్మీ' స్వరూపంగా కొలుస్తుంటారు. మన భావన ఎలా ఉన్నా ఆమె 'అనంత లక్ష్మి'. సూర్యచంద్రుల కాంతి, అగ్ని దీప్తి, భూమి గరిమ, జలం శీతలత, క్షేత్రాల పచ్చదనం, పుష్పాల సౌందర్యం, ఫలాల శోభ, ఆరోగ్యం, ఉత్సాహం, గగన వైశాల్యం, కంఠంలో పలుకు, శరీరంలో చైతన్యం, విద్యల్లో విజ్ఞానం.. ఇలా అనంతమైన శక్తులన్నీ లక్ష్మీ స్వరూపాలే. ఇన్ని శక్తులూ మూర్తీభవించిన రూపమే 'వరలక్ష్మి'. శ్రావణ శుక్రవారాల్లో వరలక్ష్మీ దేవిని అర్చించి, శాస్త్ర నియమానుసారంగా వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరిస్తే సకల సౌభాగ్యాలూ సిద్ధిస్తాయి.

**మొత్తంగా** శ్రావణమాసం అతివలకు ముచ్చట్లు తీర్చేమాసంగా ప్రసిద్ధి పొందింది. పురుషులకు పరమాద్భుతమైన ఆధ్యాత్మిక సాధనకు పునాదిగా నిలుస్తుంది. వీటన్నిటినీ అందిపుచ్చుకుని, పరమేశ్వరుడి అనుగ్రహం కోసం చేసే తపస్సుకు శ్రావణం నాందీ వాచకంగా నిలుస్తుంది.

.. డా|| కప్పగంతు రామకృష్ణ

### "ఏ రోజు.. ఏ దేవుడికి.."


**శ్రావణమాసం** శుక్లపక్షంలో వచ్చే అన్ని రోజులూ ఎంతో విశిష్టమైనవి. ఈ రోజుల్లో ఒక్కో రోజున ఒక్కో దేవతను ప్రార్థించి, అర్చించాలనే విధి నియమాలు ఉన్నాయి. పాడ్యమి- బ్రహ్మదేవుడు; విదియ- శ్రియఃపతి; తదియ- పార్వతీదేవి; చవితి- వినాయకుడు; పంచమి- శశి (చంద్రుడు); షష్ఠి- నాగదేవతలు; సప్తమి- సూర్యుడు; అష్టమి- దుర్గాదేవి; నవమి- మాతృదేవతలు; దశమి- ధర్మరాజు; ఏకాదశి- మహర్షులు; ద్వాదశి- శ్రీమహావిష్ణువు; త్రయోదశి- అనంగుడు; చతుర్దశి - పరమేశ్వరుడు; పౌర్ణమి- పితృదేవతలు. ఇలా ఆయా రోజుల్లో ఆయా దేవతలను అర్చిస్తే విశేషఫలితాలు కలుగుతాయని శాస్త్రం తెలియపరిచింది. వీటితోపాటు ఆయా తిథుల్లో శాస్త్రం చెప్పినట్లు మరికొన్ని ప్రత్యేక అర్చనలు చేసే విధానం ఉంది. శ్రావణంలో పాడ్యమి మొదలు పౌర్ణమి వరకు 15 రోజుల పాటు పవిత్రారోపణ ఉత్సవాలు చేయాలని వ్రత గ్రంథాలు చెబుతున్నాయి. పవిత్రం అంటే దర్భలతో చేసిన పొడువైన వేలి తొడుగు వంటి అమరిక. ఆయా తిథుల్లో పైన పేర్కొన్న దేవతలకు పవిత్రారోపణ ఉత్సవాలు చేయాలని శాస్త్ర వచనం.

# పలికెద నీ నామమే..

*హరే రామ హరే రామ రామ రామ హరే హరే|*
*హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే||*
(కలిసంతరణోపనిషత్తు)

రామనామం రెండు పాదాలైనా, కృష్ణ నామం రెండు పాదాలైనా కలియుగంలోని కల్మషాన్ని పోగొట్టేవే! అన్ని వేదాలలోనూ ఇంతకంటే మేలైన మంత్రం లేదని నారదునికి బ్రహ్మదేవుడు ప్రబోధించాడు. రామనామ మహిమ గురించి తెలియజేసే వృత్తాంతం ఇది. రాజయ్యాక రాముడొక యజ్ఞం చేశాడు. ఆ సమయంలో శకుంతుడనే సామంత రాజు వేటాడి అలసిపోయి యాగానికి వచ్చాడు. వేట నుంచి వచ్చిన అతను యజ్ఞవాటికలోకి వెళ్లడం సరికాదనుకున్నాడు. బయటి నుంచే రుషులకు నమస్కరించి వెనుదిరిగాడు. అక్కడే ఉన్న నారద మహర్షి.. 'శకుంతుడు వశిష్ఠుడిపై చూపిన గౌరవం మీపై చూపలేదు' అని విశ్వామిత్రుడితో అన్నాడు. దీంతో కోపోద్రిక్తుడైన విశ్వామిత్రుడు తన శిష్యుడైన రాముణ్ని పిలిచాడు. 'శకుంతుని తల తన పాదాలపై పడేలా చేయాల'ని ఆజ్ఞాపించాడు. గురువాజ్ఞ మేరకు సరేనన్నాడు రాముడు. విషయం తెలిసి.. శకుంతుడు కకావికలమయ్యాడు. రాముడే ప్రతిజ్ఞ పూనితే.. ఈ లోకంలో తనను రక్షించేవాడు ఉండడని తలచాడు. ఆత్మహత్యకు పూనుకోవాలని భావిస్తాడు. అప్పుడు నారదుడు వారించి.. 'తపస్సులో ఉన్న అంజనాదేవి శరణువేడమ'ని సలహా ఇచ్చాడు. ఆమె తపస్సు చేసే చోటికి వెళ్తాడు శకుంతుడు. అక్కడే అగ్నిగుండం ఏర్పరిచి 'అంజనాదేవి శరణు శరణు' అంటూ అందులో దూకబోయినాడు. అంజనాదేవి అభయం ఇవ్వడంతో ఆత్మహత్య ప్రయత్నం విరమిస్తాడు. శకుంతుడిని రక్షించాల్సిందిగా తన కుమారుడైన ఆంజనేయుడిని ఆజ్ఞాపిస్తుంది అంజనాదేవి. మాతృవాక్యాన్ని మన్నించి.. తన తోకను పెంచి, శకుంతుడి చుట్టూ రక్షణ వలయం నిర్మిస్తాడు హనుమ. రామనామం జపిస్తూ శకుంతుడికి కాపుకాస్తాడు. గురువు ఆజ్ఞ మేరకు శకుంతుడిని బంధించడానికి వచ్చిన రాముడు.. ఎన్ని బాణాలు ప్రయోగించినా.. రామనామం ముందు వృథా అయ్యాయి. చివరికి నారదుడు కల్పించుకొని శకుంతునితో 'నీ తల ఆ బ్రహ్మర్షి పాదాలు తాకేలా క్షమాపణలు వేడుకోమ'ని చెబుతాడు. దాంతో రాముడి వాగ్దానం నెరవేరుతుంది. రామ నామం మహిమ లోకానికి తెలిసొచ్చింది.

ఉపనిషత్ వాక్యం



పూర్వం జయదేవుడు అనే గొప్ప కృష్ణభక్తుడు ఉండేవాడు. గీత గోవిందం (సంస్కృత సంకీర్తనలు) రచించాడు. అతని భార్య పద్మావతి మహా పతివ్రత. ఒకసారి 'భర్త మరణిస్తే సహగమనం చేసే మగువకన్న భర్త మరణ వార్త చెవిసోకగానే ప్రాణాలు విడిచిపెట్టే ఆడదే గొప్పద'ని వాళ్లు ఆశ్రయం పొందిన రాజు భార్యతో చెబుతుంది పద్మావతి. ఆమె మాటలు మహారాణి విశ్వసించదు. ఒకసారి జయదేవుడు ఇంట్లోలేని సమయంలో మహారాణి ఏడుస్తూ అక్కడికి వెళ్తుంది. 'అమ్మా పద్మావతీ! అరణ్యంలో ఒక సింహం జయదేవుడిని సంహరించింది' అన్నది. వెంటనే పద్మావతి ప్రాణాలు విడిచింది. రాణి బాధపడింది. జయదేవుడు వచ్చి నామ సంకీర్తనం గావించి.. తన భార్యను బతికించుకుంటాడు. ఇది ఆ భక్తుడిపై భగవానుడి అనుగ్రహం ఒక కారణమైతే, భగవన్నామ మహిమ అసలు కారణం అంటారు భాగవతులు. మహామంత్రంగా పరిగణించే 'హరేరామ..' నామం సదా పలికేవారికి భగవంతుడి రక్ష ఎప్పుడూ ఉంటుందని చెప్పడానికి పై ఉదంతాలు మంచి ఉదాహరణలు.

... డా|| వెలుదండ సత్యనారాయణ

# నదీమతల్లికి వందనం

**గోదావరి** నదీ తీరంలో ఓ ఆధ్యాత్మిక గురువు ఆశ్రమాన్ని నిర్వహించేవాడు. అతడు తన శిష్యులతో గోదావరి జన్మస్థానమైన త్రయంబకం క్షేత్రానికి ఏటా వెళ్లేవాడు. అక్కడ బొట్టు బొట్టుగా మొదలై.. గంభీరమైన నదిగా అవతరించే గోదావరికి ప్రత్యేక పూజలు చేసేవాడు. ఓ ఏడాది ఆశ్రమ బృందం త్రయంబకేశ్వర్ బయల్దేరుతున్నది. ఇంతలో ఆశ్రమం పక్కనే ఉన్న గ్రామానికి చెందిన యువకులు కొందరు వచ్చారు. తాము కూడా యాత్రకు వస్తామని కోరారు. అందరినీ నదిలో స్నానం చేసి రమ్మన్నాడు గురువు. అందరూ సంతోషంగా నదిలో స్నానం చేసి ఒడ్డుకు చేరారు. గురువు మాత్రం వారిలో కొందరినే ఎంపిక చేసి తనతో యాత్రకు రమ్మని చెప్పాడు. ఎంపిక కానివారు.. 'మీతో రావడానికి మాకు ఎందుకు అర్హత లేదు' అని గురువును అడిగారు. అప్పుడు గురువు.. 'మన సంస్కృతిలో నదులను పవిత్రంగా భావిస్తాం. మన నాగరికత మొత్తం నదుల ఒడ్డునే అభివృద్ధి చెందింది. నీరు లేకపోతే జీవితమే లేదు. అలాంటి నదుల్ని మనం జాగ్రత్తగా కాపాడుకోకపోతే మానవ మనుగడే ఉండదు. ప్రాచీన కాలంలో నగరాలన్నీ నదీ తీరంలోనే నిర్మితమయ్యాయి. మన దేశంలో రుషులు, మునులు.. నదీ తీరంలోనే తపస్సు చేసుకునేవారు. అలాంటి నదులను మనం పవిత్ర భావనతో గౌరవించి అవి కలుషితం కాకుండా కాపాడుకోవాలి. ఇందాక స్నానం ఆచరించే సమయంలో నదులపై మీ వైఖరి ఏంటో స్పష్టమైంది' అన్నాడు గురువు. 'మేం చేసిన నేరం ఏమిటి?' అని మళ్లీ అడిగారు యువకులు. అప్పుడు గురువు 'నేను చెప్పిందే తడవుగా మీరంతా నేరుగా నదిలోకి దిగారు. యాత్రకు ఎంపికైన వారు నదిలో అడుగు పెట్టడానికి ముందు.. ఆ గోదావరి తల్లికి నమస్కరించారు. ఆ పవిత్ర జలాలను దోసిట తీసుకొని తలపై

కథాసుధ



చల్లుకున్నారు. ఆ తర్వాతే నదిలో పాదం మోపారు. అంటే వాళ్లు నదిని పవిత్రంగా భావించారు. తల్లిగా గౌరవించారు. అందుకే వారిని యాత్రకు నాతో పాటు రావడానికి ఆమోదించాను. నదులను గౌరవించడం అలవర్చుకున్న తర్వాత మిమ్మల్నీ తీసుకెళ్తాను' అని వివరించాడు.

... ఆర్సీ కృష్ణస్వామి రాజు,
93936 62821

# నడిపించే అదృశ్య శక్తి

**ఏదో** ఒక అదృశ్య శక్తి మనల్ని నడిపిస్తున్నదని భావిస్తుంటాం. ఈ విషయాన్ని , బైబిల్‌లో ప్రభువుకు ప్రియ శిష్యుడైన పౌలు మహర్షి, తాను గలతీయ జాతికి రాసిన లేఖలో ( 5:22) పేర్కొన్నాడు. వారు ఉండవలసిన మార్గం నిర్దేశం చేస్తూ.. వారికి కావలసినంత ధైర్యం చెబుతూ, ఆ అదృశ్య శక్తి పవిత్రాత్మే అనీ, అదే పరిశుద్ధాత్మ నడిపిస్తుదనీ లేఖలో వివరిస్తాడు. క్రైస్తవం త్రయైక దేవుని సూత్రాన్ని నమ్ముతుంది. ముగ్గురూ ఒకరిలోనే, ఆ ఒక్కరే ముగ్గురిలోనూ అనే దైవ సిద్ధాంతం అది. అంటే ఈ విశ్వాన్ని తండ్రి దేవుడు సృష్టిస్తే, భ్రష్టమైన ఆ లోకాన్ని కుమార దేవుడు క్రీస్తు రూపంలో రక్షిస్తే, ఆ తర్వాత ఈ లోకాన్ని నడిపించేది పరిశుద్ధాత్మ అని నమ్ముతుంది. అయితే, ఆ పవిత్రాత్మ ఎలా కంటికి రెప్పలా అనుక్షణం కాచి కాపాడుతుందంటే, ఇతరుల పట్ల ప్రేమతో ప్రవర్తించమని చెబుతుంది. దీన్నే సోదర ప్రేమగా చెప్పుకొంటాం. ఆ పవిత్రాత్మ ప్రతి మనిషిలోనూ సంతోషం నింపుతుంది. మనిషికీ మనిషికీ మధ్య శాంతి సమాధానాలు పెల్లుబికేలా చేస్తుంది. దానితో మనుషుల మధ్య భయం పోయి, స్నేహ భావం కలుగుతుంది. పునరుత్థానుడైన క్రీస్తు వెళ్లిపోయిన తర్వాత ప్రజలు అనాథలుగా ఉండకూడదని వారిలో పరస్పర దయా దాక్షిణ్యాలు, ఓర్పూ తోడు కావాలని... అందుకు తగిన రీతిలో నడిపించడానికి ఈ



పవిత్రాత్మ శక్తి నేటికీ విశ్వంలో ఆవరించి ఉంది. దేవుడు ఎంత మహోపకారం చేశాడో మానవుడు గుర్తెరిగి ఆ దైవశక్తిని స్తుతిస్తున్నాడు. ఆయనకు కృతజ్ఞుడైపోయాడు. అందుకే శాంతంగా, సాత్త్వికంగా ఉండటమూ నేర్చాడు. కొన్ని కోరికల పట్ల, ఆశల పట్ల నిగ్రహంగా ఉండటం, పేరాశలకు విరక్తి చెంది దూరంగా ఉండటమూ నేర్చాడు. అలాగే అందుకు తగ్గట్టుగా మనిషి మనిషికీ కొన్ని సుగుణాలు నిక్షిప్తం చేసి లోకంలో ఎలా మెలగాలో, ఎలా సుమాతృకగా ఉండాలో పవిత్రాత్మ అదృశ్యంగా నేర్పుతూ, ముందుకు నడుపుతుందని క్రైస్తవులు బలంగా విశ్వసిస్తారు.

... ప్రొ||బెర్నార్డ్ రాజు, 98667 55024

క్రైస్తవ సందేశం

# అమ్మపాలు అమృతం

ఆగస్టు 1-7
తల్లిపాల వారోత్సవం

**తల్లి** వెచ్చని పొత్తిళ్లు శిశువుకు స్వర్గం కన్నా మిన్న. పురిటి నొప్పులు అనుభవించి బిడ్డను కన్న తల్లి.. ఆ చిన్నారికి పాలుపడుతూ తన ప్రసవ వేదననంతా మర్చిపోతుంది. తల్లి పాలు తాగడం బిడ్డల జన్మ హక్కుగా పేర్కొంటుంది ఖురాన్. 'తల్లులు తమ బిడ్డలకు రెండు సంవత్సరాలు పాటు పాలు పట్టాలి' అని ఖురాన్ (2:233) ఉపదేశించింది. పాలు పట్టే తల్లులకూ ఖురాన్ ప్రత్యేక హక్కులు కల్పించింది. బిడ్డకు పాలిచ్చేటప్పుడు పవిత్ర భావాలను నింపుకోవాలని ఉలమాలు బోధిస్తారు. మహనీయుల తల్లులు నమాజుకు ముందు పారిశుద్ధ్యాన్ని (వుజూ) పాటించినట్లుగానే తమ బిడ్డకు పాలు పట్టేటప్పుడూ పాటించేవారని చెబుతారు. 'బిస్మిల్లాహ్' పఠించి శిశువుకు పాలుపట్టాలి. ఇలా చేయడం వల్ల పిల్లల్లో ఉత్తమ నైతిక విలువలు అలవడతాయి. 'నువ్వు పిల్లాడికి పాలు పట్టేటప్పుడు ప్రేమ, ఆప్యాయతలు కురిపించాలి. పాలిచ్చే శక్తినిచ్చినందుకు అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలపాలి' అని ఉమర్ బిన్ అబ్దుల్లాహ్ తన సతీమణితో చెప్పేవారు. తల్లి పాలు చాలకపోతే ఇతర తల్లుల పాలూ పట్టేందుకు షరీయత్ అనుమతిస్తుంది. ప్రవక్త కాలంలో తమ శిశువులకు పాలు పట్టేందుకు పల్లెసీమల తల్లులకు ఇచ్చేవారు. ముహమ్మద్ ప్రవక్త (స)కు దాయీ హలీమా అనే మాతృమూర్తి పాలిచ్చి పెంచింది. ముహమ్మద్ ప్రవక్త (స) జీవితాంతం ఆమెను ఎంతగానో ఆదరించారు. ఒకానొకసారి ముహమ్మద్ ప్రవక్త (స) తమ సహచర మిత్రులతో కలిసి కూర్చున్నారు. అంతలోనే ఒక మహిళ అటుగా వచ్చారు. వెంటనే ప్రవక్త (స) లేచి నిలబడి తన భుజంపై ఉన్న తువ్వాలును పరిచి ఆమెను కూర్చోబెట్టారు. కాసేపు మాట్లాడాక ఆమె అక్కణ్నుంచి వెళ్లిపోయారు. చుట్టూ ఉన్నవారంతా ప్రవక్త ప్రవర్తన పట్ల ఆశ్చర్యపోయారు. ఆమె వెళ్లాక ఆమె ఎవరని అడగ్గా 'ఆమె నాకు పాలిచ్చిన తల్లి' అని చెప్పారు. పాలిచ్చే తల్లులకు విధిగా పాటించే రమజాన్ ఉపవాసాల నుంచి మినహాయింపు ఇచ్చారు అల్లాహ్. పిల్లాడు పాలు మానిన తర్వాత ఆ ఉపవాసాలు చేయాల్సి ఉంటుంది.



... ముహమ్మద్ ముజాహిద్
96406 22076